సాక్షి
తూర్పుగోదావరి


శనివారం । 11 । మే । 2024



ప్రగతిలో పిఠాపురం

VIII లో

చీకటిని చీల్చుతూ ప్రగతి పట్టాలెక్కింది.. స్వచ్ఛత పల్లెవించింది.. ప్రతి రోడ్డూ కొత్త రూపును సంతరించుకుంది.. బడి బాగుపడింది. అధునాతన సౌకర్యాలతో ఊరే మారింది..



డెల్టాలకు నీటి విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్ర వారం తూర్పు డెల్టాకు 100, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0°/26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	37.0	26.0
కాకినాడ	36.7	27.6
అమలాపురం	41.0	28.0

న్యూస్‌రీల్

డెల్టా కాలువల మూసివేత



తూర్పు డెల్టా ప్రధాన కాలువ

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలను శుక్ర వారం సాయంత్రం మూసివేశారు. రబీ సాగు, తాగునీటి అవసరాల కోసం శుక్రవారం వరకూ నీటిని విడుదల చేశారు. వాస్తవానికి గత నెల 30వ తేదీనే డెల్టా కాలువలు మూసివేయాల్సి ఉంది. అయితే, తాగునీటి అవసరాలకు, శివారు భూములకు నీరు అందించాలనే ఉద్దే శంతో ఇప్పటి వరకూ నీటిని విడుదల చేశారు. జూన్ రెండో వారంలో ఖరీఫ్ పంటలకు నీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులు ప్రణాళి కలు రూపొందిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ 16,169 మంది

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తం గా ఎన్నికల విధుల్లో ఉన్న 16,169 మంది అధి కారులు, సిబ్బంది, అత్యవసర విభాగంలో సేవలందించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో అంతర్ జిల్లాల వారు 3,529 మంది, అత్యవ సర సేవలు అందించే ఉద్యోగులు 107 మంది ఉన్నారని పేర్కొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబం ధించి రాజమండ్రి లోక్‌సభ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరిగే ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పి.జగదీష్ శుక్ర వారం పరిశీలించారు. రిసెప్షన్ కౌంటర్, పార్కింగ్ ఏరియా, ట్రాఫిక్ డైవర్షన్లతో పాటు ఆయా ప్రదేశాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాట్లను కూడా పరిశీలించారు. మూడు షిఫ్టుల్లో పోలీసు భద్రత, సీసీ కెమెరాలతో నిరం తర పర్యవేక్షణ ఏర్పాటు చేశామని ఈ సం దర్భంగా చెప్పారు. కార్యక్రమంలో నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి.. భక్తజనఝరి



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: అక్షయ తృతీయ పర్వదినం సంద ర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్న గిరి శుక్రవారం కిక్కిరిసింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని ఆలయ అధికా రులు తెలిపారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తర లివచ్చారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యో తులు వెలిగించి, పూజలు చేశారు. వ్రతాలు రెం డు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవ స్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు నాలుగు వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ క్రైం: జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సం క్షేమ శాఖ సాధికార అధికారి కె.ప్రవీణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, సాంకే తిక పరిజ్ఞానం, ధైర్యసాహసాలు, పర్యావరణం, క్రీడలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖ నం, నూతన ఆవిష్కరణలు, ప్రత్యేక నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలతో రాణిస్తున్న పిల్లలు దీనికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వివరించారు. అటువంటి పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు ప్రోత్సహించి దరఖాస్తు చేయించాలని సూచిం చారు. ఆసక్తి ఉన్నవారు http://awards.gov.inవెబ్‌సైట్ ద్వారా జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన బాలలు రాబోయే రిపబ్లిక్ డే రోజున రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రత్యేక బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందుకుంటారని ప్రవీణ పేర్కొన్నారు.



నేడు పిఠాపురానికి సీఎం జగన్

- ఎన్నికల ప్రచారానికి ఇక్కడే ముగింపు
- వెల్లువలా తరలి రానున్న జనం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉమ్మడి తూర్పు గడ్డపై ముగింపు పలకనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో వివిధ రూపాల్లో ఇప్పటి వరకూ సీఎం జగన్ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, మేమంతా సిద్ధం బస్సు యాత్రలు ఒకదానికి మించి మరొకటి జనసంద్రంతో పోటెత్తు తున్నాయి. జనం నుంచి మంచి స్పందన లభిస్తోం ది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మీదుగా సాగిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర తదనంతరం జరి గిన ఎన్నికల ప్రచార సభలు జన ప్రభంజనాన్ని తలపించాయి. జిల్లాలో జగన్ అడుగు పెట్టిన ప్రతిసారీ మేమంతా మీకు తోడుగా ఉన్నామంటూ వేలాది మంది ఆయన అడుగులో అడుగులు వేసి మద్దతుగా నిలిచారు. తొలుత జరిగిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు అటు కోనసీమ, ఇటు మెట్ట ప్రాంతాలు కదలివచ్చాయి. కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో మొదలైన ఈ బస్సు యాత్ర రాజ మహేంద్రవరం, రాజానగరం, రంగంపేట, సామర్లకోట, కాకినాడ రూరల్, పిఠాపురం, కత్తి పూడి, తుని మీదుగా అనకాపల్లి జిల్లాలోకి సాగిపో యింది. ఈ బస్సు యాత్రకు అశేషంగా జనం తరలి వచ్చారు. మధ్యలో అచ్చంపేట జంక్షన్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ వెల్లు వలా తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి ప్రసంగిం చారు. తదనంతరం జిల్లాకు ఒకటి చొప్పున జరిగిన ఎన్నికల ప్రచార సభలు కూడా జనజాతరలను తలపించాయి. గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ వేలాదిగా కదలి వచ్చిన జనం.. తమ అభిమాన నాయకుడిని కళ్లారా చూసి, పులకించిపోయారు. బస్సు యాత్ర అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్న వరం నియోజకవర్గం అంబాజీపేట సెంటర్‌లో నిర్వహించిన సభతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచార సభలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. మూడు రోజుల క్రితం తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ లక్ష్మీనర సింహస్వామి ఆలయ సన్నిధిలో నిర్వహించిన రెం డో సభలో అశేషంగా తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి ఆయన ప్రసగించారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రం పిఠాపు రంలో శనివారం సాయంత్రం నిర్వహించే సభతో ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్ ముగింపు పలక నున్నారు. ఆయన సభలన్నీ ఒకదానికి మించి మరొకటి విజయవంతం కావడంతో ఉమ్మడి జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నెలకొంది. జగన్ అడుగు పెట్టిన ప్రతిచోటా జనసునామీ పోటెత్తింది. ఆయన పాల్గొంటున్న పిఠాపురం సభను కూడా అదిరిపోయేలా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంతో కదులుతున్నాయి.

సీఎం పర్యటన జరగనుందిలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా కైకలూరులో మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి 2.55 గంటలకు పిఠాపురం హెలి ప్యాడ్‌లో దిగనున్నారు. అక్కడి నుంచి పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో జరిగే బహిరంగ సభకు హాజరై 3.20 నుంచి 4.05 గంటల వరకూ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. సభ అనంతరం తాడేపల్లి బయలుదేరి వెళ్తారు.

వెల్లువెత్తిన అభిమానంతో...

సహజంగానే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ వారసుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి పర్యటన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడతోనే ప్రారంభమైంది. అప్పటి నుంచీ ఆయన అంటే తూర్పు గడ్డ ఎంతో అభిమానం చూపిస్తోంది. మహానేత హఠా న్మరణం తరువాత అసువులు బాసిన వారి కోసం కాంగ్రెస్‌కు ఎదురొడ్డి పోరాడి, జగన్ నిర్వహించిన ఓదార్పు యాత్ర జిల్లా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ఆ తరువాత రైతుల భవిష్యత్తు కోసం రావులపాలెం నుంచి పోలవరం వరకూ హరిత యాత్ర పేరిట పాదయాత్ర నిర్వహించి వారి మనసుల్ని చూరగొన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజల మేలు కోసం ప్రతిపక్ష నేతగా జగన్ నిరంతరం పరితపించారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను 99 శాతం పైగా అమలు చేసి చూపించారు. ఇచ్చిన ప్రతి మాటా అమలు చేయబట్టే జగన్ సభ అంటేనే పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా జనం వెల్లువలా తరలి వస్తున్నారు.



కంబాల చెరువు పార్కు



కంబాల చెరువు వద్ద దండి మార్చ్ జంక్షన్



పుష్కరాల రేవు వద్ద పుష్కర ప్లాజా



హ్యాపీ స్ట్రీట్

ప్రగతి కాంతులు

- ఐదేళ్లుగా అభివృద్ధి పథంలో రాజమహేంద్రవరం
- రూ.433 కోట్లతో మౌలిక వసతులు, సుందరీకరణ పనులు
- చారిత్రక నగరంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి
- రూ.125 కోట్ల ప్రత్యేక నిధుల కేటాయింపు
- రూ.10 కోట్లతో కంబాల చెరువు ఆధునీకరణ
- 90 శాతం పైగా పూర్తయిన పనులు



లాలాచెరువు వద్ద ఆకట్టుకుంటున్న గ్లో గార్డెన్



ప్రభుత్వ వైద్య కళాశాల

సాక్షి, రాజమహేంద్రవరం: చారిత్రక నగరం.. సాంస్కృ తిక రాజధానిగా ప్రతీతి చెందిన ప్రాంతం.. హోల్‌సేల్ వస్త్ర వాణిజ్యానికి చుక్కాని.. నేడు జిల్లా కేంద్రం.. ఇటువంటి రాజమహేంద్రవరం నగరం రూపురేఖలు ఐదేళ్లలో పూర్తిగా మారిపోయాయి. ఐదు లక్షలకు పైగా ఉన్న జనాభా ఉన్న ఈ నగరంలో ప్రజలకు అవ సరమైన అన్ని రకాల మౌలిక వసతులూ ప్రభుత్వం కల్పించింది. నగరంలోని పలు కూడళ్లు, ప్రధాన ప్రాం తాలను పెద్దపెద్ద నగరాలను తలదన్నే రీతిలో అందం గా తీర్చిదిద్దింది. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, పార్కులు, రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేసింది. నగర అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా సాధారణ, మున్సిపల్, ప్రత్యేక, రుడా నిధులు రూ.558 కోట్లు వెచ్చించింది. వీటిలో రూ.217 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరాభివృద్ధికి ప్రత్యేకంగా రూ.125 కోట్లు కేటాయించారు. ఈ నిధు లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

పర్యాటక కేంద్రంగా కంబాల చెరువు

నగరం నడిబొడ్డున ఉన్న కంబాల చెరువు పార్కును పర్యాటక మణిహారంగా తీర్చిదిద్దారు. పదెకరాల్లో విస్తరించిన ఈ పార్కులో ఆరెకరాల్లో చెరువును అభి వృద్ధి చేసి, బోటింగ్ సదుపాయం కల్పించారు. మరో నాలుగు ఎకరాల్లో జాగింగ్ ట్రాక్, బోట్ సైక్లింగ్, లేజర్ షో, 360 డిగ్రీ సైక్లింగ్, 360 డిగ్రీ అమ్యూజ్‌మెం ట్ రైడ్, ట్రాంపోలిస్ ఎక్విప్‌మెంట్, స్కై బెలూన్ (చిల్డ్ర న్స్), స్కై రోలర్, వాటర్ వాకింగ్ బాల్స్, బాడీ బార్బింగ్ బాల్స్, ఫ్లూ కోర్ట్, పురుషుల జిమ్, సీటింగ్ గ్యాలరీ, మెయిన్ ఎంట్రన్స్ ప్లాజా, ఓఏటీ జోన్, స్టేట్ ప్రైడ్ జోన్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా వంటి అధునాతన ఆకర్షణలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఆక్వా లేజర్ షో ఏర్పాటు చేశారు.

పట్టాలెక్కిన పుష్కర ప్లాజా

పుష్కర్ ఘాట్ సమీపాన రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన వృథాగా ఉన్న స్థలం నేడు సుందర ప్రదేశంగా రూపు దిద్దుకుంది. 200 మీటర్ల పైబడిన ఈ రోడ్డును పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. సందర్శకులు కూర్చునేం దుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆహ్లాదాన్ని పంచేలా సైన్ బోర్డులు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంక రించారు. పచ్చదనం పెంపొందించడంతో ప్రజలు సెల్ఫీల కోసం పోటీ పడుతున్నారు.

హ్యాపీ స్ట్రీట్

సెలవు రోజుల్లో సరదాగా గడిపేందుకు జేఎన్ రోడ్డులోని ఏకేసీ కళాశాల సమీపాన అభివృద్ధి చేసిన హ్యాపీ స్ట్రీట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇక్కడ రూ.80 లక్షలతో ప్రజలను ఆకర్షించే ఆకృతుల్లో నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటి వరకూ దేశంలోని మహానగరాలకే పరిమితమైన హ్యాపీ స్ట్రీట్ మొట్టమొ దటిసారిగా రాజమహేంద్రవరంలో కొలువు తీరింది.

దండి మార్చ్ సెంటర్

జాతిపిత మహాత్మా గాంధీ రాజమహేంద్రవరాన్ని ఐదుసార్లు సందర్శించారు. ఆయన గురుతులను, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి ప్రతీకగా దండి మార్చ్ సెంటర్‌ను రూ.1.5 కోట్లతో అభివృద్ధి చేశారు. దీంతో పాటు పుష్కర ఘాట్, దేవీచౌక్ వంటి 12 జంక్షన్లను రూ.7.26 కోట్లతో ఆధునీకరించారు.

రూ.4.3 కోట్లతో పార్కుల సుందరీకరణ

నగరంలో రూ.4.3 కోట్లతో 40 ఎకరాల విస్తీర్ణంలో 37 పార్కుల సుందరీకరణ చేపడుతున్నారు. కొత్తగా మహాలక్ష్మి పార్క్, గాదాలమ్మ నగర్ పార్క్, ఏకేసీ పార్క్, అంబేడ్కర్ పార్క్, సాయి చైతన్య కాలనీ పార్క్, ఎస్‌బీఐ కాలనీ పార్కుల అభివృద్ధికి ప్రణా ళికలు రూపొందించగా.. ఇప్పటికే పురోగతిలో ఉన్నాయి. చౌడేశ్వరి నగర్‌లో రూ.4.4 కోట్లతో గ్లో గార్డెన్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. గాంధీపురం వద్ద కూడా రూ.3 కోట్లతో గ్లో గార్డెన్ నిర్మాణం పూర్తయింది. పద్మావతి నగర్ పార్కులో చిన్నారులకు రూ.2 కోట్లతో స్విమ్మింగ్ పూల్ అందుబాటులోకి తెచ్చారు.

జగనన్న స్మార్ట్ రోడ్స్

జగనన్న స్మార్ట్ రోడ్స్ పేరిట రూ.8.5 కోట్లతో వై జం క్షన్ నుంచి లాలాచెరువు జంక్షన్ వరకూ 3 కిలోమీటర్ల మేర ఆధునాత రహదారి అందుబాటులోకి తీసుకువ స్తున్నారు. దీని నిర్మాణంలో 8 అంశాలను ప్రామాణి కంగా తీసుకుంటున్నారు. ఆహ్లాదాన్ని పంచుతూనే ప్రయాణం సాఫీగా సాగేలా ఈ రోడ్డు రూపుదిద్దుకుం టోంది. దీనికి ఇరువైపులా 2.5 మీటర్ల వెడల్పున ఫుట్‌పాత్ నిర్మిస్తున్నారు. దీనిపై ఆహ్లాదాన్ని నింపేలా గడ్డి ఏర్పాటు చేస్తున్నారు. యువత ఆనందంగా గడిపేందుకు అక్కడక్కడ సెల్ఫీ పాయింట్లు అందుబా టులోకి తెస్తున్నారు. గోడలు అందంగా కనిపించేలా రంగు రంగుల బొమ్మలు వేయిస్తున్నారు. వై-జంక్షన్ నుంచి పుష్కర ఘాట్ వరకూ రూ.5 కోట్లతో ఫుట్‌పా త్‌ల నిర్మాణంతో పాటు పార్కింగ్, డస్టు బిన్లు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో 16 కిలోమీటర్ల మేర రూ.12.6 కోట్లతో 15 రకాల రహదారులు నిర్మిస్తు న్నారు. ఇంకా షెల్టన్ హోటల్ నుంచి మోరంపూడి జం క్షన్ రోడ్డును రూ.7 కోట్ల వ్యయంతో 100 అడుగులకు విస్తరించారు.

పనులు	నిధులు (రూ.కోట్లలో)
రోడ్లు	98
డ్రైన్లు	54
నీటి సరఫరా	28
వీధి దీపాలు	9
పార్కులు	9
బ్యూటిఫికేషన్	13
సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్	16
భవనాలు	6
ప్రత్యేక నిధులు	100
సీఎం మంజూరు చేసినవి	125

అభివృద్ధికి నిధులు ఇచ్చారిలా..

పచ్చదనానికి పెద్దపీట

జగనన్న హరిత నగరాల్లో భాగంగా రూ.4.3 కోట్లతో రాజమహేంద్రవరంలో 7.3 కిలోమీటర్ల మేర డివైడర్ల మధ్యన పచ్చదనం పెంపొందించారు. అలాగే, 17 కిలోమీటర్ల మేర 15,000 మొక్కలు పెంచారు. ఎయిర్ పోర్ట్ రోడ్డులో 12 కిలోమీటర్ల మేర రాజమహేం ద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా), మున్సిపల్ నిధులతో మొక్కలు పెంచుతున్నారు.

రూ.53 కోట్లతో మురుగు కాలువలు

రూ.53.85 కోట్లతో నగరంలో 51 కిలోమీటర్ల మేర మురుగు కాలువల నిర్మాణాలు, ఆధునీకరణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే సింహభాగం పూర్త య్యాయి. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి.

ఆరోగ్యానికి ప్రాధాన్యం

నగర ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. దీనికి అనుగుణంగా నగరంలో రూ.5 కోట్లతో 5 అర్బన్ హెల్త్ సెంటర్లకు మరమ్మ తులు చేపట్టారు. ఒక్కొక్కటి రూ.80 లక్షల వ్యయంతో 6 అర్బన్ పీహెచ్‌సీల నిర్మాణం చేపడుతున్నారు.

మెడి'కల' సాకారం

నగర వాసుల మెడికల్ కళాశాల ఏర్పాటు కలను ప్రభుత్వం నెరవేర్చింది. సెంట్రల్ జైలు స్థలంలో రూ.475 కోట్లతో కళాశాల నిర్మాణ పనులు చేపట్టారు. అకడమిక్ కార్యకలాపాలకు ఉద్దేశించిన ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్ (పీఈబీ) నిర్మాణం చేపట్టారు. దీంతో 2023–24 విద్యా సంవత్సరంలో 150 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా రాజమహేం ద్రవరం జీజీహెచ్‌కు మహర్దశ పట్టింది. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఈ ఆస్పత్రిని 500 పడకల బోధనాస్పత్రిగా విస్తరించారు.

ఇంకా..

- వై-జంక్షన్, హ్యాపీ స్ట్రీట్ వంటి ప్రధాన, ప్రజలు ఆహ్లాదంగా గడిపే ప్రదేశాల్లో రూ.1.2 కోట్ల వ్యయంతో వాటర్ ఫౌంటైన్లు ఏర్పాటు చేశారు.
- నగరంలో ప్రజలకు రుచికరమైన ఆహారం ఒకేచోట అందించేందుకు ఆర్ట్స్ కళాశాల వద్ద ఈట్ స్ట్రీట్‌ను అందుబాటులోకి తెచ్చారు.
- కళాభిమానులు సాంస్కృతిక కార్యక్రమాలు కూర్చొని తిలకించేందుకు వీలుగా ఆనం కళాకేంద్రం వద్ద అతి పెద్ద అధునాతన ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం అందుబాటులోకి తెస్తున్నారు. దీనికి రూ.1.2 కోట్లు వెచ్చిస్తున్నారు.
- సుబ్రహ్మణ్య మైదానంలో ఓపెన్ యాంఫీ థియేటర్ అందుబాటులోకి తెచ్చారు.
- గోదావరి నదిపై చారిత్రక నేపథ్యం కలిగిన హేవలాక్ బ్రిడ్జిపై 2.7 కిలోమీటర్ల మేర ఆర్నమెంటల్ లైటింగ్ అమర్చారు. గోదావరి స్నానాలకు వస్తున్న భక్తులను ఇది అమితంగా ఆకట్టుకుంటోంది.
- నగరంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించేందుకు రూ.4.6 కోట్లతో అధునాతన కమాండ్ కంట్రోల్ రూము నిర్మాణం చేపట్టారు.

హింసను ఉపేక్షించం

- ప్రచారానికి నేటితో తెర
- జిల్లాలో 144 సెక్షన్ అమలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పూర్తి స్థాయిలో సహకారం అందిం చాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీ లత విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థులు, వారి ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శుక్ర వారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లా డారు. అభ్యర్థులు స్నేహపూర్వక వాతావరణం లో, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకారం అందించాలని కోరారు. ఆమె ఏమన్నారంటే..

- పోలింగ్ సోమవారం జరగనున్న దృష్ట్యా ఈ మూడు రోజులూ అత్యంత కీలకం.
- ప్రచార గడువు శనివారం సాయంత్రం 6 గం టలతో ముగుస్తుంది, ఆ తరువాత ఎటువంటి ప్రచారానికి, ర్యాలీలకు అనుమతులు లేవు.
- ఎమ్మెల్యే అభ్యర్థులు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3 వాహనాలకు, ఎంపీ అభ్యర్థులు తన పరిధిలో 3 వాహనాలకు, అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒక్కొక్కటి చొప్పున వాహనాల అనుమ తులకు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ వాహనాల్లో అభ్యర్థి మాత్రమే తిరగాలి.
- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉం టుంది. ప్రజలు గుంపులు గుంపులుగా సంచ రించరాదు.
- పోలింగు కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకూ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలి.
- ఓటరు స్లిప్పులు పంపిణీ సందర్భంగా ఎటువంటి ప్రచారమూ చేయరాదు.
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే, ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండానే బైండో వర్ కేసులు నమోదు చేస్తాం. ఒకసారి ఎన్ని కల బైండోవర్ కేసు నమోదు చేస్తే, ప్రతి ఎన్నికలోనూ ఆయా పరిణామాలు ఎదుర్కో నక తప్పదు.
- ఎన్నికల ఫలితాలకు సంబంధించి రాజకీయ పార్టీలు ముందస్తుగా ఎగ్జిట్ పోల్ సర్వేలు నిర్వహించరాదు.
- జూన్ 6వ తేదీ వరకూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుంది.
- ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ ఏజెంట్, ఇద్దరు రిలీవర్లను నియమించుకోవచ్చు. పోలింగ్ ఏజెంట్లుగా స్థానికులనే అనుమతి స్తాం. వీరికి ప్రిసైడింగ్ అధికారి గుర్తింపు కార్డు ఇస్తారు.
- ఫామ్–10 చూపించిన వారిని పోలింగ్ కేం ద్రంలోకి అనుమతిస్తారు. ఒకసారి ఒక్కరినే లోపలకు అనుమతిస్తారు.
- పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు.
- తగిన గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతిస్తాం.
- పోలింగ్ కేంద్రాల బయట, లోపల వెబ్ కాస్టిం గ్ ఏర్పాటు చేస్తున్నాం.
- పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుంచి ఎలక్ట్రానిక్ మీడియాలో ఎటువంటి రాజకీయ ప్రకటనలూ జారీ చేయ కూడదు.
- రాజకీయ ప్రయోజనాల కోసం ఈ నెల 12, 13 తేదీల్లో వార్తా పత్రికల్లో ప్రచురించదలచిన ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిస రి. మీడియా సంస్థలు కూడా అనుమతి లేని ప్రకటనలు ప్రచురించరాదు.
- శాటిలైట్ చానళ్లు, కేబుల్ టీవీ, రేడియో, బల్క్ మెసేజ్‌లు, ఈ–పేపర్లు, సామాజిక మాధ్యమాలు, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదే శాల్లోని ఎల్‌ఈడీ స్క్రీన్లు ఎలక్ట్రానిక్ మీడియా కిందకే వస్తాయి. వీటిలో ప్రచారాలు చేస్తే ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ఉల్లంఘన కింద కేసులు నమోదు చేస్తాం.
- సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నర సింహులు కూడా పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, డీఆర్ఓ నరసింహులు

క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు



అడ్వాన్స్‌డ్ క్రియేటివిటీ సర్టిఫికెట్ కోర్సుపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 15 నుంచి అడ్వాన్స్‌డ్ క్రియేటివిటీ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే శుక్రవారం తెలిపారు. కళాశాల జేకేసీ, ఐఏసీటీ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో పది, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులకు తమ కళాశాలలో అడ్వాన్స్‌డ్ క్రియేటివిటీపై సర్టిఫికెట్ కోర్సు శిక్షణ ఇస్తున్నామన్నారు. షార్ట్ టర్మ్ కోర్సులైన సర్టిఫికెట్ కోర్సు ఇన్ కంప్యూటర్ అప్లికేషన్, సర్టిఫికెట్ కోర్సు ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ అప్లికేషన్, డీటీపీ, వీడియో ఎడిటింగ్‌లతో పాటు లాంగ్ టర్మ్ కోర్సులైన వీఎఫ్ఎక్స్, కంపోస్టింగ్ ప్లస్, త్రీడీ యానిమేషన్‌లకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 14న కళాశాలలో జరిగే అవగాహన సదస్సుకు హాజరై, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు 90301 10847, 85199 66620, 79818 62200 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రగతిలో పిఠాపురం

- అన్నింటా అభివృద్ధి పథాన పట్టణం
- ఐదేళ్లలో అదరగొట్టిన సంక్షేమం
- మున్సిపాలిటీలో ప్రధాన సమస్యలకు మోక్షం

పిఠాపురం: చీకటిని చీల్చుతూ ప్రగతి పట్టాలెక్కింది.. స్వచ్ఛత పల్లెవించింది.. ప్రతి రోడ్డూ కొత్త రూపును సంతరించుకుంది.. బడి బాగుపడింది.. అధునాతన సౌకర్యాలతో ఊరే మారింది.. ఈ ఐదేళ్లలో పిఠాపురం పట్టణం ఎనలేని అభివృద్ధిని సొంతం చేసుకుంది.. ఆ విశేషాలు తెలుసుకుందాం రండి. పీఠికాపురం రావు వెంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ పరిపాలించిన ఈ ప్రాంతం 1957లో పిఠాపురం మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎనిమిది మంది చైర్మన్లు బాధ్యతలు నిర్వర్తించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆధ్యాత్మిక కేంద్రం పిఠాపురం అభివృద్ధిలో దూసుకుపోతోంది. 2019 నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ.150 కోట్లతో వివిధ పనులు చేయడం విశేషం.

ఏళ్ల నాటి సమస్యల పరిష్కారం

పిఠాపురంలో ముఖ్యంగా పారిశుధ్య సమస్య వెంటాడేది. రోడ్లు, డ్రైన్లు మురికి కూపాలుగా మారేవి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.6 కోట్లతో అన్ని వార్డుల్లోనూ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. ఇక్కడి ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారికి పెద్దాసుపత్రిగా ఉన్న సీహెచ్‌సీని ఆధునీకరించారు. ఎక్కడా లేని విధంగా స్త్రీల వార్డును అభివృద్ధి చేశారు. వైద్య సదుపాయాలు మెరుగుపర్చారు. పట్టణంలో మంగయ్యమ్మరావు పేటలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను అధునాతన సౌకర్యాలతో నిర్మించారు. పట్టణంలోకి వచ్చే వారికి ఇప్పటి వరకూ నరకం చూపించిన రైల్వే గేట్ల సమస్యకు పరిష్కారం చూపించి.. మాధవపురం, గోర్స రైల్వే గేట్ల వద్ద ఆర్‌యూబీలు నిర్మించారు. ప్రధాన రహదారిలో ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం స్థానిక రైల్వే స్టేషన్‌ను రూ.కోట్లతో ఆధునీకరించారు. పట్టణంలో ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధితో పాటు రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ సెంటర్లు నిర్మించారు. మంచినీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించడానికి సుమారు రూ.32 కోట్లు వెచ్చిస్తున్నారు.



పిఠాపురంలో కొత్తగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్



పిఠాపురంలో మాధవపురం వద్ద నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి



నాడు-నేడు పనుల్లో సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల

నాడు- నేడుతో బాగుబడింది

పిఠాపురం మున్సిపల్ పరిధిలోని 79 పాఠశాలల్లో మొదటి విడత «నాడు- నేడు» నిధులు రూ.11.07 కోట్లతో 40 ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండో విడత నాడు- నేడు నిధులు రూ.20.12 కోట్లతో 56 పాఠశాలలను అభివృద్ధి చేసే పనులు పూర్తి కావొచ్చాయి. తొలి విడత అభివృద్ధి చేసిన కొన్ని పాఠశాలల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు ప్రైవేట్‌కు దీటుగా మారాయి.

గత ఐదేళ్లలో వెచ్చించిన నిధులు ఇలా..

- రూ.85 లక్షలతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం
- రూ.8.84 కోట్ల 14వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ అభివృద్ధి పనులు
- రూ.5.50 లక్షలతో జగనన్న నగర బాటల అభివృద్ధి
- రూ.98.50 లక్షల ఎంపీ నిధులతో పనులు
- రూ.6 కోట్ల గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో పనులు
- రూ.5.21 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో పలుచోట్ల అభివృద్ధి
- రూ.9.93 కోట్ల జనరల్ ఫండ్స్‌తో పనులు
- రూ.30.10 కోట్ల అమృత్ పథకం నిధులతో తాగునీటి సరఫరా అభివృద్ధి పనులు (త్వరలో ప్రారంభం కానున్నాయి)
- రూ.5.50 కోట్లతో మాధవపురం రైల్వే అండర్ బ్రిడ్జి
- రూ.4.50 కోట్లతో రైల్వే గోర్స అండర్ బ్రిడ్జి
- రూ.150 కోట్లతో ఉప్పాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం (త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.)
- రూ.5 కోట్లతో పట్టణంలో రైల్వే స్టేషన్ ఆధునీకరణ
- రూ.4.7 కోట్లతో డిగ్రీ కాలేజీ నిర్మాణం

ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి

ప్రభుత్వ ప్రోత్సాహంతో పిఠాపురం పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశాం. ప్రధాన సమస్యలైన రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాం. ఒక్క మున్సిపాలిటీ ద్వారానే ఇప్పటి వరకూ రూ.63 కోట్లకు పైగా నిధులు వెచ్చించి పనులు చేశాం. మరిన్ని నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో వార్డు సచివాలయానికి రూ.20 లక్షలు ఇవ్వగా, మా విజ్ఞప్తి మేరకు మరో రూ.20 లక్షల చొప్పున అదనపు నిధులు అందించారు. పట్టణంలో ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపించాం.

-గండేపల్లి సూర్యావతి, చైర్‌పర్సన్, పిఠాపురం మున్సిపాలిటీ

గాండ్ల, తెలుకుల, దేవతెలుకులకు సముచిత స్థానం



సంకిస భవానీప్రియ

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాండ్ల తెలుకుల దేవతెలుకుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి సామాజికవర్గ అభివృద్ధికి బాటలు వేశారని రాష్ట్ర గాండ్ల తెలుకుల దేవతెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీప్రియ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది డైరెక్టర్లను నియమించారన్నారు. అదేవిధంగా సామాజిక వర్గీయులకు మున్సిపాలిటీలు, పంచాయతీల్లో వివిధ పదవులు, నామినేటెడ్ పోస్టులు అందించి సముచిత స్థానం కల్పించారని ఆమె అన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గాండ్ల కులస్తులు సంక్షేమ పథకాలను పొందారని, ఈ ఐదేళ్లలో అనేక రూ.కోట్ల లబ్ధి జరిగిందన్నారు. శ్రీకాకుళంలో ప్రభుత్వ స్థలం కేటాయించి గాండ్ల కమ్యూనిటీ భవనం నిర్మించారన్నారు. కుప్పంలో రెండెకరాల స్థలం కేటాయించి కల్యాణ మండపం, కమ్యూనిటీ హాల్ నిమిత్తం ఎంపీ ల్యాడ్స్ ద్వారా రూ.50 లక్షలు, ప్రభుత్వం ద్వారా మరో రూ.50 లక్షలు ఇస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారని ఆమె వివరించారు. మన్యం జిల్లాలోని పార్వతీపురంలో గాండ్ల కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో అనేక మంది గాండ్ల కులస్తులు ఇళ్ల పట్టాలు పొందారన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

అయినవిల్లి: ఓ వ్యక్తి శుక్రవారం విద్యుదాఘాతానికి మృతి చెందాడు. దీనికి సంబంధించి మృతుడి బంధువులు, ఎస్సై వి.రాజేష్‌కుమార్ కథనం ప్రకారం.. అయినవిల్లి మండలం నేదునూరు బొక్కావారిపాలేనికి చెందిన బొక్కా మధుసుదనరావు (38) తన ఇంట్లో వైరింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయవాడలో బ్రిక్స్ కంపెనీలో ఆపరేటర్‌గా ఆయన పనిచేస్తున్నాడు. దీనిపై మృతుడి తండ్రి గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అన్నదేవరపేటలో మరొకరు..



మృతి చెందిన వసంతవాడ రాంబాబు

తాళ్లపూడి: అన్నదేవరపేటలోని పామాయిల్ తోటలో విద్యుత్ షాక్‌కు ఓ వ్యక్తి మృతి చెందాడు. తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్‌సుందర్ కథనం ప్రకారం.. బీమోలు రైతు ముళ్లపూడి రత్నాజీకి చెందిన పామాయిల్ తోటలో వసంతవాడ రాంబాబు (32) పని చేయడానికి వెళ్లాడు. పామాయిల్ చెట్టు గెలలు, ఆకులను ఐరన్ పైప్‌తో నరుకుతున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగలడంతో రాంబాబు విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో రైతు రత్నాజీ మరొకరి సాయంతో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి అతన్ని తరలించారు. అయితే రాంబాబు అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య వసంతవాడ నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి

మలికిపురం: విశ్వేశ్వరాయపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త జిల్లెళ్ల గౌతమ్‌పై టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడి చేశారు. శుక్రవారం ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి కార్యకర్తలు విశ్వేశ్వరాయపురంలో వైఎస్సార్ సీపీ జెండాతో ఉన్న కార్యకర్త గౌతమ్‌పై దాడి చేశారు. స్పృహ తప్పిన అతన్ని స్థానికులు రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న గౌతమ్‌ను రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు పరామర్శించారు. కూటమి దాడిని తీవ్రంగా ఖండించారు.

సఖినేటిపల్లిలోనూ దురుసు ప్రవర్తన

కూటమి ర్యాలీ సందర్భంగా సఖినేటిపల్లి మండలంలో కూడా టీడీపీ, జనసేన నాయకులు దురుసుగా ప్రవర్తించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ సామరస్యంగా ప్రచారం చేస్తుండగా టీడీపీ నాయకులు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సఖినేటిపల్లి లాకుపేట, మెయిన్ రోడ్లలో ఈ సంఘటనలు చోటు చేసుకున్నాయి.



వైఎస్సార్ సీపీ కార్యకర్త గౌతమ్‌ను పరామర్శిస్తున్న అభ్యర్థులు గొల్లపల్లి సూర్యారావు, రాపాక వరప్రసాదరావు

ఓటమి భయంతో దాడులకు తెగబడుతున్న టీడీపీ

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కల్యాణి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

కాకినాడ రూరల్: టీడీపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులకు తెగబడుతోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుకు మద్దతుగా ప్రచారం చేసేందుకు వచ్చిన ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బీసీ సంఘాల నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. టీడీపీ కూటమిని ఓడించేందుకు ప్రజలు డిసైడ్ అవ్వడంతో బాబుకు నిద్ర పట్టడం లేదన్నారు. ఇటీవలే హోం మంత్రి తానేటి వనితపై దాడి చేశారని, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణిపై దాడికి పాల్పడ్డారని చెప్పారు. విజయవాడలో బొండా ఉమా కుమారుడు దళితులపై దాడికి పాల్పడ్డారని, బనగానపల్లిలో వైఎస్సార్ సీపీ నేతలు, మహిళలపై టీడీపీ నాయకులు దాడికి తెగబడ్డారని గుర్తు చేశారు. టీడీపీ కూటమి ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధిస్తుందని కల్యాణి అన్నారు. సీఎం జగన్ నలుగురు బీసీలకు రాజ్యసభ సీట్లు ఇస్తే.. బాబు ఒక్క బీసీకి కూడా సీటు ఇవ్వకుండా బీసీ ద్రోహిగా నిలిచారన్నారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకు ఇవ్వాలని సీఎం జగన్ చట్టం తీసుకువచ్చారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు జమ్మలమడక నాగమణి, వర్దినీడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యపై దాడి సరికాదు

రాజమహేంద్రవరం సిటీ: శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ ఆర్.కృష్ణయ్యపై టీడీపీ రాళ్ల దాడి చేయడం దారుణమని బీసీ సంక్షేమ సంఘ జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో గెలవాల్సిన టీడీపీ నాయకులు ప్రత్యర్థులపై భౌతిక దాడులకు దిగడం పిరికిపంద చర్య అని ఆమె మండిపడ్డారు.

అండగా నిలిచి.. కష్టాలు తీర్చి..

- నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన సీఎం జగన్
- ఐదేళ్లలో పథకాల ద్వారా రూ.3 లక్షల మేర లబ్ధి



తల్లీకుమార్తెలు కేశిబోయిన గనికమ్మ, చీకట్ల లక్ష్మి

గోకవరం: తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన కేశిబోయిన గనికమ్మ 70 ఏళ్ల వృద్ధురాలు. వృద్ధాప్యం కారణంగా ఇంటి వద్దే ఉంటోంది. ఆమె భర్త చనిపోవడంతో కుమార్తె చీకట్ల లక్ష్మితో కలిసి కాలం వెళ్లదీస్తోంది. 2019కి ముందు తల్లీకూతుళ్లు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వం అమలు చేసిన నవరత్న పథకాలు వీరి జీవితాల్లో వెలుగులు నింపాయి. ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వకుండా, ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల వద్దకు వెళ్లకుండా ప్రభుత్వ పథకాలు తమ ఇంటి ముందుకే వచ్చాయని, మగ దిక్కు లేని తమ కుటుంబానికి జగన్‌మోహన్‌రెడ్డి కొడుకుగా అండగా నిలబడ్డారని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో పింఛను కోసం పాట్లు

గత ప్రభుత్వాల హయాంలో పింఛను కోసం తల్లీకూతుళ్లు గనికమ్మ, లక్ష్మి అవస్థలు పడేవారు. పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి పింఛను తెచ్చుకునేవారు. ఒక్కోసారి అనారోగ్యానికి గురైనా వెళ్లాల్సి వచ్చేది. పింఛను తీసుకోకపోతే పోతుందేమోనని భయంతో తప్పనిసరి పరిస్థితుల్లో వరుసలో గంటల తరబడి నిలబడి పింఛను తీసుకునేవారు. ఒక్కోసారి తెల్లవారుజామున వెళితే సాయంత్రం అయిపోయేది. వేలిముద్రలు పడకపోతే రెండు మూడు రోజులు కూడా వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారకుండానే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛను సొమ్ము అందిస్తున్నారని, ఆనాటి కష్టాల నుంచి విముక్తి లభించిందని వారు తెలిపారు.

ఇంటి స్థలం మంజూరు

గనికమ్మ, లక్ష్మి అద్దె ఇంట్లో ఉంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయకపోవడంతో వేలకు వేలు అద్దె చెల్లించి పరాయి పంచన ఉంటున్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా లక్ష్మికి ఇంటి స్థలం మంజూరైంది. తమకు ఇంటి స్థలం వస్తుందని కలలో కూడా అనుకోలేదని అటువంటి కలను జగన్ సాకారం చేశారని లక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తోంది. స్థలం కోసం తాము ఎవరి వద్దకు వెళ్లలేదని, వలంటీర్ ఇంటికి వచ్చి తమ వివరాలు నమోదు చేసుకున్నారని ఆమె చెప్పింది. త్వరలోనే ఇంటిని నిర్మించుకుని అద్దె ఇంటి నుంచి సొంత ఇంట్లోకి వెళ్లిపోతామని వెల్లడించింది. ఏటా వైఎస్సార్ ఆసరా సొమ్ము నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని, ఈ మొత్తాన్ని పొదుపు చేసుకుని ఇంటి నిర్మాణానికి వినియోగిస్తానని చెబుతోంది. ఈ ప్రభుత్వం తరువాత నాలుగున్నరేళ్లలో వీరిద్దరికీ కలిపి సుమారు రూ.3 లక్షల వరకూ పింఛను సొమ్ము అందగా, లక్ష్మికి వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగేళ్లలో సుమారు రూ.60 వేలు నగదుతో పాటు ఇంటి స్థలం వచ్చింది.

కష్టాలు తీరాయి

నా భర్త చనిపోయి చాలా కాలమైంది. ఎప్పటి నుంచో పింఛను తీసుకుంటున్నాను. గత ప్రభుత్వంలో పింఛను కోసం పంచాయతీ కార్యాలయం వద్ద వేచి ఉండాల్సి వచ్చేది. జగన్‌బాబు సీఎం అయ్యాక పింఛను కష్టాలు తీరాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లు ఒకటో తేదీన తెల్లవారకుండా ఇంటికే వచ్చి పింఛను అందిస్తున్నారు. ఇప్పుడు ఆ పింఛను సొమ్మే నాకు ఆధారం. జగన్ నా కొడుకు లాగా చూసుకుంటున్నాడు. - కేశిబోయిన గనికమ్మ

పథకాలన్నీ అందాయి

నాకు ముగ్గురు ఆడపిల్లలు. నా భర్త వీర వెంకట సుబ్బారావు 2006లో మృతి చెందారు. అప్పట్లో రూ.200 పింఛను వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం రూ.3 వేలు పింఛను ఇస్తోంది. నా పిల్లలకు పెళ్లిళ్లు చేశాను. నాకు సొంత స్థలం లేదు. అద్దె ఇంట్లో మా అమ్మతో కలిసి ఉంటున్నాను. వేలకు వేలు ఖర్చు పెట్టి అద్దె చెల్లించుకోలేక నానాయాతనలు పడుతున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా స్థలం మంజూరు చేశారు. త్వరలోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని సొంత ఇంట్లోకి వెళతాను. సీఎం జగన్ పథకాలన్నీ ఇచ్చి ఆదుకున్నారు. వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి వంటి పథకాల్లో కూడా నాకు లబ్ధి చేకూరింది. - చీకట్ల లక్ష్మి

బ్రాహ్మణులకు అండగా ఉంటాం..

- దాడుల నిరోధానికి ప్రత్యేక చర్యలు
- విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

కాకినాడ: బ్రాహ్మణ సామాజికవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడచిన ఐదేళ్లలో ఎన్నో చర్యలు తీసుకున్నారని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక డీ కన్వెన్షన్‌లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన కందాళ దుర్గ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సదస్సుకు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మరో ఎమ్మెల్యే మల్లాది విష్ణు హాజరయ్యారు. రాయవరపు ప్రభాకర్, భమిడిపల్లి మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సభలో మల్లాది విష్ణు మాట్లాడుతూ దేవాలయాలు, పురోహితులు, అర్చకులపై జరుగుతున్న దాడులను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకొస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూజారుల జీతభత్యాలను రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచారని చెప్పారు. బ్రాహ్మణ వర్గీయులంతా వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ విజ్ఞాన వంతులైన బ్రాహ్మణులు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. ద్వారంపూడి మాట్లాడుతూ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ బ్రాహ్మణ వర్గాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకున్నారన్నారు. రాజకీయంగా సముచిత స్థానం కల్పించారన్నారు. బ్రాహ్మణ కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కామేశ్వరరావు, సంఘ ప్రతినిధులు రాయప్రోలు కృష్ణమూర్తి, పోతాప్రగడ రవికుమార్, అజ్జరపు సత్యనారాయణ, శర్మ, పిండిప్రోలు రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, చిత్రంలో కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, చంద్రశేఖరరెడ్డి

బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట

కాకినాడ రూరల్: బ్రాహ్మణ సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుకు మద్దతుగా ఆయన నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ బ్రాహ్మణ సొసైటీ ద్వారా పెద్ద ఎత్తున వ్యక్తిగత, గ్రూపు రుణాలు మంజూరయ్యాయన్నారు. అర్చకులకు వంశపారంపర్య హక్కులు కల్పించి, పదవీ విరమణ తొలగించారని, తద్వారా ఓపిక ఉన్నంత వరకూ అర్చకత్వం చేసుకునే వెసులుబాటు లభించిందన్నారు. బ్రాహ్మణులకు సొసైటీ పేరిట బ్రాహ్మణ బ్యాంకు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఐదేళ్లలో రూ.784 కోట్లు బ్రాహ్మణ సంక్షేమానికి ఖర్చు చేశారని, టీడీపీ హయాంలో కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. మృతి చెందిన కుటుంబాలకు గరుడ పథకంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయం పెండింగ్ లేకుండా అందజేశారన్నారు. వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించేందుకు బ్రాహ్మణులు ఏకతాటిపైకి రావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ, బ్రాహ్మణ సంఘాల నాయకులు కందాల కనకదుర్గ, రవికుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై కేసులు

- తొమ్మిది మంది అరెస్ట్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిఘా బృందాలు మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాయి. కోనసీమ జిల్లాలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన దాడులు, తనిఖీల్లో మొత్తం 934 మద్యం సీసాలు, 202 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్)ను స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడులు, తనిఖీల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం శుక్రవారం రాత్రి తెలిపింది. జిల్లాలో ఎస్ఈబీ నిఘా బృందాలు దాడులు, తనిఖీలు చేసి మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న 9 మందిని అరెస్ట్ చేసి 10 కేసులు నమోదు చేశారు. వారి నుంచి 771 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 163 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 202 లీటర్ల ఐఎంఎల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.18 వేల విలువైన తొమ్మిది జతల ఫ్యాంట్లు, షర్ట్ బిట్లు, తొమ్మిది చీరలు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం, జొన్నాడ, బొబ్బర్లంక, ఎదుర్లంక, దిండి, నరసాపురపుపేటల్లో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా బృందాలు వాహనాలను ఆపి శుక్రవారం విస్తృత తనిఖీలు చేశాయి. తాళ్లరేవు మండలం కోరింగి గ్రామంలోని షాడో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఎంవీ చంద్రకాంత్ తనిఖీ చేశారు. అలాగే మండలంలోని సముద్ర తీరం హోప్ ఐలెండ్‌లో నివాసం ఉంటున్న ప్రజలతో ఆయన మమేకమై పోలింగ్ రోజున అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించారు.



తాళ్లరేవు మండలం హోప్ ఐలెండ్ నివాసితులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్